సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 13 । మార్చి । 2024



వందేభారత్‌కు ఘన స్వాగతం

వందేభారత్ రైలుకు ఇచ్ఛాపురంలో ఘనంగా స్వాగతం పలికారు. ఇక్కడ హాల్ట్ కల్పించడంపై కృతజ్ఞత తెలిపారు. - 8లో



చెల్లెమ్మలకు చేయూత

జిల్లాలో పలు చోట్ల చేయూత సంబరాలు కొనసాగాయి. వేలాదిగా మహిళలు తరలివచ్చారు. - 8లో

ముస్లిం సోదరుల ఇఫ్తార్ విందు



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని జీటీ రోడ్డులో ఉన్న జామియా మసీదులో రంజాన్ మాసం సందర్భంగా మొదటి రోజు మంగళవారం సాయంత్రం ఇఫ్తార్ విందు నిర్వహించారు. ముస్లిం సోదరులంతా పాల్గొని ముందుగా ప్రార్థనలు చేశారు. అలాగే అన్ని మసీదులలో కూడా ప్రార్థనలు జరిగాయి.

జనసేన.. అవమానాలేనా.!

- జనసేన నాయకులను తరచూ అవమానిస్తున్న టీడీపీ నాయకులు
- తాజాగా జనసేన కార్యకర్తలను కించపరిచేలా కలమట వెంకటరమణ వ్యాఖ్యలు
- పాతపట్నం నియోజకవర్గంలో జనసేనకు నాయకత్వం ఎక్కడుందని ప్రశ్న
- జనసేనకు పాతపట్నం టిక్కెట్ ఇస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని స్పష్టీకరణ
- కలిసి పనిచేసేది లేదని పరోక్షంగా వెల్లడి



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : జనసేనపై టీడీపీ నాయకులు చులకన భావాన్ని చూపుతూనే ఉన్నారు. పొత్తు కుదిరినా ఎప్పటికప్పుడు, ఎక్కడికక్కడ తక్కువ చేస్తూ మాట్లాడుతూనే ఉన్నారు. శంఖారావం కార్యక్రమంలో భాగంగా లోకేష్ జిల్లాకు వచ్చినప్పుడు దాదాపు ప్రతి చోటా అవమాన పరిచారు. కొన్నిచోట్లైతే సభా ప్రాంగణంలోకి వచ్చిన జనసైనికులపై చేయి చేసుకున్నారు. అయినా అధినేత మాటకు తలొగ్గి ఇష్టం లేకపోయినా టీడీపీ నాయకులతో కలిసి వెళ్తున్నారు. కానీ జనసైనికులకు అంత సీన్ లేదంటూ టీడీపీ నాయకులు తీసి పారేస్తున్నారు. తాజాగా పాతపట్నం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి కలమట వెంకటరమణ చేసిన వ్యాఖ్యలు జనసేన పార్టీ నాయకులను మరింత అవమానపరిచాయి. జనసేనలో ఇక్కడంత నాయకుల్లేరని, ఒకవేళ జనసేనకు టిక్కెట్ ఇస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానే తప్ప కలిసి పనిచేసేది లేదని చెప్పడం చర్చనీయాంశమైంది.

'టీడీపీ నాయకులతో కలిసి నడవండి... ఒక మాట అన్నా పడండి.. పొత్తులో భాగంగా సాగండి. నా విధానాలు నచ్చి నాతో నడిచే వారే నా మనుషులు. కాదన్న వారంతా కోవర్టులే...నా వ్యూహం ప్రకారంగా నడుచుకోవాలి. లేదంటే పార్టీ నుంచి వెళ్లిపోవచ్చు' తరచూ జనసైనికులను ఉద్దేశించి పవన్ కల్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలివి. ఈ వ్యాఖ్యలను అలుసుగా తీసుకుంటున్న టీడీపీ నాయకులు తర చూ జనసేన కార్యకర్తలను చులకనగా చూస్తున్నా రు. ఆ కారణంగా జిల్లాలో చాలాచోట్ల జనసైనికులు టీడీపీ నాయకులతో కలిసి వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు. కొందరు తప్పదనే పరిస్థితుల్లో వెళ్తున్నారు. అయిష్టంగా కలిసి వస్తున్న చోట కూడా ఆ పార్టీ నాయకులను టీడీపీ నాయకులు తేలికగా తీసుకోవడమేకాకుండా అవమానపరుస్తున్నారు.

రాజకీయాల నుంచి తప్పుకుంటా..

తాజాగా పాతపట్నం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి కలమట వెంకటరమణ ఓ మీడియాతో మాట్లాడుతూ జనసేన పరువు తీసేశారు. పొత్తులో భాగంగా పాతపట్నం జనసేనకు కేటాయిస్తే మీరేమి చేస్తారని ఆ విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ అసలు పాతపట్నంలో జనసేనకు అంత నాయకులు ఎక్కడున్నారని ప్రశ్నించారు. అంతటితో ఆగలేదు ఒకవేళ పొత్తులో భాగంగా జనసేనకు ఇస్తే రాజకీయాలకు నమస్కారం పెట్టి రాజకీయాల నుంచి తప్పుకుంటానే తప్ప ఈ కలమటోళ్లు ఎప్పుడూ కూడా ఇలా కింద చేయి ఉండే పరిస్థితి లేదని తేల్చి చెప్పేశారు. ఇప్పుడీ వ్యాఖ్యలు నియోజకవర్గంలోనే కాదు జిల్లాలోనే చర్చనీయాంశంగా మారాయి.

ఆవేదనలో జనసైనికులు

తనకు టిక్కెట్ ఇస్తే జనసేన పనిచేయాలే తప్ప తాను మాత్రం పొత్తులో భాగంగా జనసేనకు టిక్కెట్ ఇస్తే చేసేది లేదని చెప్పడం తమను అవమానపరచడమేనని జనసైనికులు భావిస్తున్నారు. తమకు ఇష్టం లేకపోయినా అధినేత మాటకు కట్టుబడి టీడీపీతో ముందుకు సాగుతుంటే అడుగడుగునా తమను అవమానపరుస్తున్నారని, ఓటేసినప్పుడు బుద్ధి చెబుతామంటూ కొందరు జనసైనికులు వాపోతున్నారు. తమ పరిస్థితి చూస్తుంటే పిలవని పేరంటానికి వెళ్తున్నట్టుగా ఉందని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు.

ఒకే ఒక్కడు వైఎస్ జగన్

- మంచి జరిగి ఉంటేనే ఓటు వేయాలని అడిగే దమ్మున్న నాయకుడు జగనన్న
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- ఘనంగా వైఎస్సార్‌సీపీ 14వ ఆవిర్భావ దినోత్సవాలు



శ్రీకాకుళంలోని పార్టీ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న ధర్మాన కృష్ణదాస్, పార్టీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): తాను మంచి చేశానని భావిస్తేనే ఓటు వేయాలని ప్రజలను కోరే దమ్మున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒక్కడేనని వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శ్రీకాకుళంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు ఆధ్వర్యంలో పార్టీ 14వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా దివంగత నేత వైఎస్సార్ చిత్రటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కేక్ కట్ చేశారు. అనంతరం చేపలవీధిలోగల మున్సిపల్ స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలకు సంబంధించిన కిట్లు అందించారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ జగనన్న సింహంలా సింగిల్‌గా పోటీ చేస్తుంటే మిగిలిన పార్టీలు ఏం చేయాలో తెలీక పొత్తులు పెట్టుకుంటున్నాయని అన్నారు. సీఎం వైఎస్ జగన్ బలం, బలగం ఈ రాష్ట్ర ప్రజలేనన్న వాస్తవం విపక్షాలకు ఇప్పటికే అర్థమైపోయిందన్నారు. గత ఐదేళ్లలో ఈ రాష్ట్ర ప్రజలకు కుటుంబాలవారీగా ఎవరికి ఎంత సంక్షేమం అందిందో సీఎం జగన్ లేఖలతో స్పష్టం చేస్తున్నారని, అలా చెప్పగలిగే ధైర్యం, దమ్ము చంద్రబాబుకు ఉందా అని సవాల్ చేశారు. అధికార దాహంతోనే చంద్రబాబు అన్ని పార్టీలతో పొత్తు కోసం కాళ్లావేళ్లా పడుతున్నారని ఎద్దేవా చేశారు. జగనన్న సైనికుల్లా పనిచేసి 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అఖండ విజయాన్ని అందించాలని కోరారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ఎంవీ పద్మావతి, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, పొన్నాడ రుషి, గొండు రఘురాం, చల్లా అలివేలుమంగ, అంధవరపు ప్రసాద్, అంధవరపు రమేష్, సాదు వైకుంఠరావు, ఎం.ఏ రఫీ, సిజ్జు, పీస గోపి, పి.సుగుణారెడ్డి, డాక్టర్ శ్రీనివాస పట్నాయక్, మార్పు పృథ్వి, గంగు శారద, నల్లి ఆశా దీపిక, గుంట జ్యోతి, రత్నాల నరసింహమూర్తి, ఎం.ఏ బేగ్, కనపల తేజ,సీపాన రామారావు పాల్గొన్నారు.

తల్లిని పొట్టన పెట్టుకున్నారు..



జగనన్న పాలనలో జరిగిన మేలును బహిరంగంగా చెప్పిందనే అక్కసుతో ట్రోలింగ్ చేసి టీడీపీ, జనసేన సోషల్ మీడియా ప్రతినిధులు గీతాంజలి మరణానికి కారణమయ్యారు. ఒక రకంగా ఆమెను వారు హత్య చేసినట్లే. టీడీపీ, జనసేన సోషల్ మీడియాను కట్టడి చేయాలి.
– ఆర్.హైమావతి, పొందర,కూరాకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్

మహిళలు గమనించాలి



గీతాంజలిని వేధించి ఆత్మహత్యకు ప్రేరేపించి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి. చంద్రబాబు, జగన్ మళ్లీ జన్మభూమి కమిటీల పాలన తీసుకురావాలని అనుకుంటున్నారు. మహిళలు వీటిని గమనించాలి. – హేమమాలినీ రెడ్డి, రాష్ట్ర ఉమెన్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్

నిందితులను కఠినంగా శిక్షించాలి



మహిళలను చిన్న చూపు చూడడం జనసేనకు బాగా అలవాటు. ఎన్నో ఏళ్లుగా సొంత ఇంటి కోసం ఎదురుచూస్తున్న గీతాంజలికి ప్రభుత్వం నుంచి ఇళ్ల మంజూరైతే ఆ సంతోషంలో ఆమె చెప్పిన మాటలను తట్టుకోలేక టీడీపీ, జనసేన సోషల్‌మీడియా దారుణంగా ఆమెను హింసించారు. దీంతో ఆత్మక్షోభకు గురై ఆత్మహత్య చేసుకుంది. ఇలాంటి దారుణానికి కారణమైన టీడీపీ, జనసేన సోషల్‌మీడియా కార్యకర్తలను కఠినంగా శిక్షించాలి. – చింతాడ మంజు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు.

ఆ మూకను శిక్షించి తీరాల్సిందే

గీతాంజలికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, స్థానిక మహిళలు



తనకు ఓ గూడు దొరికిందని ఆ తల్లి సంతోషపడింది. మంచి చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞత చెబుతూ సంబరపడింది. అదే ఆ అమ్మ చేసిన తప్పైపోయింది. ఆమె మాట్లాడిన నాలుగు మాటలను తీసుకుని టీడీపీ, జనసేన సోషల్ మీడియా మూకలు రెచ్చిపోయాయి. ఓ సాధారణ ఇల్లాలు అని కూడా చూడకుండా ఆమెను వేధించుకుని తిన్నాయి. అనుచిత వ్యాఖ్యలు చేస్తూ రాక్షసానందం పొందాయి. యజమానుల మెప్పు పొందడానికి ఉచ్ఛనీచాలు మర్చిపోయి సామాజిక మాధ్యమాల్లో పోస్టింగులు చేశాయి. ఈ వికృత క్రీడకు తెనాలికి చెందిన 'గీతాంజలి' అనే సామాన్యురాలు బలైపోయింది. ట్రోలింగ్‌కు తట్టుకోలేక ఏకంగా ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతిపై మహిళా లోకం భగ్గుమంటోంది. ట్రోలింగ్ చేసి వేధించిన వారిని తక్షణం పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరుతోంది. – టెక్కలి, ఎచ్చెర్ల క్యాంపస్, కవిటి, పాతపట్నం

వారిని కఠినంగా శిక్షించాలి

నరసన్నపేట: గీతాంజలి అనే మహిళను టీడీపీ, జనసేన మూక లు పొట్టన పెట్టుకున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక పురుషోత్తం నగర్ కాలనీ వద్ద స్థానిక మహిళలతో కలసి గీతాంజలి మృతికి శ్రద్ధాంజలి ఘటించారు. సోషల్ మీడియా వేదికగా ఏ మహిళపై అయినా ఈ విధంగా దూషిస్తే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బాధాకరం



సోషల్ మీడియా ట్రోలింగ్‌కు గీతాంజలి మృతి చెందడం బాధాకరం. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి కఠిన చట్టాలు తీసుకురావాలి. గీతాంజలి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి. – బెందాళం పద్మావతి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి, బొరివంక

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



తెనాలికి చెందిన గీతాంజలి మృతికి కారకులైన వారిని విడిచిపెట్టకూడదు. టీడీపీ, జనసేత నేతలు వేధించడం వల్లనే గీతాంజలి మృతి చెందింది. – బి.విజయలక్ష్మి, రాష్ట్ర డైరెక్టర్, మత్స్యశాఖ, తెంబూరు గ్రామం, పాతపట్నం



చెల్లెమ్మలకు 'చేయూత'



కాశీబుగ్గ: సంత మైదానంలో వైఎస్సార్ విగ్రహం వద్ద జన సందోహం



పాతపట్నం: మార్కెట్‌యార్డు వద్ద జరిగిన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

వైఎస్సార్ చేయూత సంబరాలు జన సంద్రాన్ని తలపిస్తున్నాయి. మంగళవారం పాతపట్నం, పలాస, టెక్కలి, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో జరిగిన కార్యక్రమాలకు మహిళలు పోటెత్తారు. మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామంటూ నినదించారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి సీదిరి అప్పలరాజు, ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, గొర్లె కిరణ్‌కుమార్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

\- సాక్షి నెట్‌వర్క్



జి.సిగడాం: వైఎస్సార్ చేయూత సభకు భారీగా హాజరైన మహిళలు



కోటబొమ్మాళి: వైఎస్సార్ చేయూత సంబరాలకు హాజరైన మహిళలు

క్లుప్తంగా

భక్తి గీతాలతోనే గుర్తింపు



కారుణ్యకు జ్ఞాపిక అందజేస్తున్న కృష్ణమాచార్యులు, శంకరశర్మ

అరసవల్లి: సినీ సంగీత ప్రపంచంలో భక్తి గీతాలాపన చేసే గాయకులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ప్రముఖ సినీ గాయకుడు ఎస్.సి.కారుణ్య అన్నారు. అరసవల్లి సూర్యనారాయణ స్వామిని మంగళవారం కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనివేటి మండపంలో ఆదిత్యున్ని కీర్తిస్తూ పలు కీర్తనలు, భక్తిగీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా కారుణ్య మాట్లాడుతూ ఆదిత్యుని సన్నిధిలో గీతాలాపన చేయడం అదృష్టమన్నారు. ఖలేజా సినిమాలో 'ఓం నమో శివ రుద్రాయ...ఓం నమో స్థితి కంఠాయ..' అనే పాటకు అద్భుత స్పందన లభించి మంచి గుర్తింపు వచ్చిందన్నారు. ఆలయ విశిష్టతను, పర్వదినాల విశేషాలను అర్చకులు ఇప్పిలి రంజిత్ శర్మ వివరించారు.

ప్రతి పంచాయతీలో గొర్రెల పెంపకందారుల సంఘాలు



మాట్లాడుతున్న జిల్లా చైర్మన్ చిన్నారావు యాదవ్

నందిగాం: జిల్లాలో ప్రతి పంచాయతీలోనూ గొర్రెలు, మేకల పెంపకదారుల సహకార సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా గొర్రెలు, మేకల పెంపకదారుల సహకార సంఘ సమాఖ్య చైర్మన్ రాపాక చిన్నారావు యాదవ్ అన్నారు. నందిగాం మండలం కవిటి అగ్రహారంలో మంగళవారం గొర్రెల, మేకల పెంపకదారుల సంఘాన్ని ఏర్పాటు చేశారు. కవిటి అగ్రహారం సచివాలయంలో సర్పంచ్ బొమ్మాళి వరలక్ష్మి గున్నయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సంఘ అధ్యక్షుడిగా ఐతి తిరుపతిరావు, ఉపాధ్యక్షుడిగా బంగారు కృష్ణారావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పిట్ట రామారావు, గురుదాసుపురం సంఘ అధ్యక్షుడు పానిల కృష్ణారావు, జయరామచంద్రపురం అధ్యక్షుడు లొడగల అప్పారావు, అఖిలభారతీయ యాదవ కుల యువజన అధ్యక్షుడు డొక్కరి దిలీప్‌కుమార్, బందాపు తిరుమల, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.


కమ్యూనిటీ పోలీసింగ్‌కు ప్రాధాన్యత



మాట్లాడుతున్న ఎస్పీ జీఆర్ రాధిక

మందస: ప్రతిఒక్కరూ సత్ప్రవర్తనతో మెలిగినప్పుడే నేరాల సంఖ్య తగ్గుతుందని ఎస్పీ జీ.ఆర్.రాధిక అన్నారు. మందసలో మంగళవారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేరాల అదుపు చేయడానికి పోలీసులు కృషి చేస్తుంటారని, వారికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలకు సేవలు అందిస్తున్నామన్నారు. అనంతరం గురుదేవ ఛారిటబుల్ ట్రస్టు(విజయనగరం) సహకారంతో మదర్ వాలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు అందజేశారు. జెమ్స్ వైద్యులు శ్రీనివాసరావు, దివ్య, శివమణిసాయి, విజయ్ కుమార్, శ్రీహర్ష 250 మంది వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రేమ్‌కాజల్, డీఎస్పీ జి.నాగేశ్వరరెడ్డి, సీఐ పి.ఈశ్వరరావు, మందస ఎస్ఐ బి.అనిల్‌కుమార్, జెమ్స్ మేనేజర్ బి.చిన్నారావు, ఏరియా మేనేజర్ రాపాక తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగంలో సంప్రోక్షణ పూజలు



శ్రీముఖలింగం ఆలయంలో సంప్రోక్షణ పూజలు చేస్తున్న అర్చకులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో శివరాత్రి ఉత్సవాలు అనంతరం మంగళవారం ఉదయం సంప్రోక్షణ, శుద్ధి, పుణ్యాహవచన పూజలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు, అధికారులు పుణ్యతీర్థాల నదుల జలంతో పాటు పంచగవ్యతో శుద్ధి చేశారు. ఉదయం ఈ సంప్రోక్షణ పూజలు పూర్తి చేసి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు దర్శనాలకు అనుమతి ఇచ్చారు. శివరాత్రి ఉత్సవాలు, చక్రతీర్థ స్నానాలు అనంతరం స్వామికి ఇలా సంప్రోక్షణ పూజలు చేయడం సంప్రదాయమని అర్చకులు తెలిపారు.

'వందేభారత్'కు ఘన స్వాగతం

ఇచ్ఛాపురం/ఆమదాలవలస: భువనేశ్వర్- విశాఖ వందేభారత్ రైలుకు ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ మంగళవారం ఘన స్వాగతం పలికి సిబ్బందిని ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇచ్ఛాపురం నియోజకవర్గ ప్రజల సౌకర్యార్థం మరిన్ని రైళ్ల హాల్టింగ్ కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. ఇటీవల ఢిల్లీ పర్యటనలో రైల్వే మంత్రిని కలిసి విన్నవించగా.. విశాఖ- పలాస పాసింజర్ పొడిగింపు, వందేభారత్ రైళ్ల హాల్టింగ్ కేటాయించినట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, ఎంపీపీలు బోర పుష్ప, పైల దేవదాస్, జెడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, ఏఎంసీ బాబూరావు, ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు ఆదిరెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ చిట్టిబాబు, మున్సిపాలిటీ, మండల పార్టీ అధ్యక్షులు ప్రకాశరావు పట్నాయక్, రాజశేఖర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు సాలిన ఢిల్లీ, ఆశి పురుషోత్తం, ముఖ్య నేతలు నీలాపు లక్ష్మి, మందాకిని, పిలక సంతోష్, చాట్ల తులసీదాస్, కాళ్ల సత్యం, సల్లా దేవరాజు, పొడుగు కామేష్, రాంజీ, పిలక విజయ్, బి.త్రినాథ్, నీలాపు ఢిల్లీ, వివేకానంద, దేవ, మోహన్‌దాస్, లోహిదాస్ పాల్గొన్నారు. అనంతరం శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌లో శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు వందేభారత్ రైలుకు స్వాగతం పలికి ఇచ్ఛాపురం వరకు ప్రయాణించారు.



వందేభారత్ రైలుని జెండా ఊపి ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

డ్రోన్ దీదీలకు అభినందనలు



డ్రోన్ దీదీలను అభినందిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్



గాయత్రిని అభినందిస్తున్న కలెక్టర్

పోలాకి : స్వశక్తి–నారీశక్తి కార్యక్రమంలో భాగంగా ఢిల్లీలో ప్రధాని మోదీ ఎదురుగా డ్రోన్ ఎగురవేసిన అరసవల్లి గాయిత్రితో పాటు గుంటూరు నుంచి వర్చువల్‌గా అదే కార్యక్రమానికి హాజరైన మరో తొమ్మిది మంది డ్రోన్ దీదీలను ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అభినందించారు. మంగళవారం మబగాంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు కోసం పనిచేస్తున్నారని కితాబునిచ్చారు. వీరందరూ జిల్లా వాసులు కావటం, రాష్ట్రంలో వందమంది డ్రోన్‌దీదీల్లో నరసన్నపేట నియోజకవర్గానికి చెందిన వారు ఆరుగురు ఉండటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ట్రైనర్, కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శిమ్మ నేతాజీ, ఏడీఏ రవీంద్రభారతి, ఏవో చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ అభినందనలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పోలాకి మండలం సుసరాం గ్రామానికి చెందిన డ్రోన్ దీదీ అరసవిల్లి గాయత్రిని కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్ అభినందించారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా డ్రోన్ అందుకున్న సందర్భంగా ఆమెతో పాటు మిగతా డ్రోన్ దీదీలు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శిమ్మ నేతాజీ, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ కలిసి కలెక్టర్, జేసీ ఎం.నవీన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ధ్రువపత్రాలు చూపించారు.

రహదారి భద్రత మనందరి బాధ్యత



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రోడ్డు ప్రమాదాల కారణంగా ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఉండరాదని, యాక్సిడెంట్లు జరగకుండా రహదారి భద్రతా చర్యలు పాటించాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. రవాణా, పోలీస్, జాతీయ రహదారి, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య తదితర శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. శ్రీకాకుళం నవభారత్ బైపాస్ కూడలి వద్ద ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని, అక్కడ భూ సేకరణ చేపట్టి రహదారి విస్తరణ పనులు త్వరగా చేపట్టాలని ఎన్.హెచ్.ఏ.ఐ అధికారులను ఆదేశించారు. సింగుపురం అండర్ పాసేజ్‌లో నీరు నిల్వ ఉండరాదని, హైవేపై గుర్తించిన 33 బ్లాక్ స్పాట్‌లపై దృష్టి సారించాలన్నారు. ఎస్పీ రాధిక మాట్లాడుతూ హైవేలపై ప్రతి రెండు మండలాల పరిధిలో పెట్రోలింగ్ వాహనాలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి ఎ.చంద్రశేఖర్ రెడ్డి, అదనపు ఎస్పీ ప్రేమ కాజల్, డీఆర్వో ఎం.గణపతిరావు, రవాణా శాఖ అధికారి గంగాధరరావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్, ఎన్‌హెచ్ఏఐ పీడీ ప్రభాకర్, డీఎంహెచ్ఓ బి.మీనాక్షి, జిల్లా పంచాయతీ అధికారి కె.వెంకటేశ్వర్లు, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి మోహనరావు, జెమ్స్ ఆర్ఎంఓ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలకు రూ.1263.41 కోట్ల రుణాలు

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలో 2023–24 ఏడాది ఈ నెల 11వ తేదీ నాటికి అన్ని బ్యాంకుల ద్వారా 34,621 స్వయం సహాయక సంఘాలకు రూ.1263.41 కోట్ల మేర రుణాలు మంజూరు చేసినట్లు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సూర్యకిరణ్ మంగళవారం తెలిపారు. ఈ రుణాల మంజూరు 150.38%గా ఉందని పేర్కొన్నారు. రణస్థలంలో 1844 గ్రూపులకు రూ.69.23 కోట్లతో జిల్లాలో మొదటి స్థానంలో ఉందన్నారు. జగనన్న తోడులో జిల్లా మంచి ప్రగతి సాధించిందన్నారు. ఈ నెలాఖరు నాటికి రుణ లక్ష్యాన్ని అందుకుంటామని ధీమా వ్యక్తంచేశారు.

జాతీయ బాక్సింగ్ పోటీలకు దుర్గాప్రసాద్

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయస్థాయి సబ్‌జూనియర్స్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా కేంద్రానికి చెందిన పి.దుర్గాప్రసాద్ ఎంపికయ్యాడు. ఈ నెల 18 నుంచి 24 వరకు ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా వేదికగా జరగనున్న ఈ పోటీలకు 58 కేజీల విభాగంలో దుర్గాప్రసాద్ ఎంపిక కావడంతో స్టార్‌వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ గేదెల ఇందిరాప్రసాద్, స్టార్‌వాకర్స్ వనిత క్లబ్ అధ్యక్షురాలు జి.లక్ష్మి ఆర్థిక సాయం అందించారు. పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోచ్ పి.ఉమామహేశ్వరరావు, అసిస్టెంట్ కోచ్ రాజీవ్, బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా కార్యదర్శి బలగ అనంత లక్ష్మణ్‌దేవ్(అను), డీఎస్‌డీవో డాక్టర్ కె.శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మగ్గంవర్క్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో మగ్గం వర్క్ శిక్షణకు మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 30 రోజుల శిక్షణకు సంబంధించి ఈ నెల 18వ తేదీ నుంచి బ్యాచ్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. 17వ తేదీలోపు 19 నుంచి 45 ఏళ్ల మధ్య మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మగ్గం వర్క్ శిక్షణలో బ్లౌజ్ కుట్టడం, డ్రెస్ డిజైనింగ్, శారీ పెయింటింగ్‌లపై నిపుణులతో అధునాతన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ, భోజనం, వసతి ఉచితమని చెప్పారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 9553410809, 799 3340407 సంప్రదించాలని పేర్కొన్నారు.

బొడ్డేపల్లి రాజగోపాలరావు సేవలు చిరస్మరణీయం



రాజగోపాలరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చైర్మన్ దుంపల లక్ష్మణరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): బొడ్డేపల్లి రాజగోపాలరావు సేవలు చిరస్మరణీయమని.. జిల్లాకు, కళింగ జాతికి ఎన్నో సేవలందించారని కళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల లక్ష్మణరావు (రామారావు) అన్నారు. మంగళవారం రాజగోపాలరావు 101వ జయంతి సందర్భంగా శ్రీకాకుళం నగరంలో సింహద్వారం వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బొడ్డేపల్లి దామోదర్‌రావు, చాపర వెంకటరావు, తిర్లంగి లోకనాథం, గురుగుబెల్లి పెంటయ్య, బొడ్డేపల్లి నాగేశ్వరరావు, ఏబీబీసీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యాసంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశ పరీక్షల ద్వారా ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల శ్రీకాకుళం జిల్లా కన్వీనర్ దాసరి హేమంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని, 5వ తరగతికి ఏప్రిల్ 13న, ఇంటర్‌కు ఏప్రిల్ 27న ప్రవేశ పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ సమీపంలో యర్రచెరువు వద్ద రైల్వే డౌన్‌లైన్ ట్రాక్‌పై గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైందని జీఆర్‌పీ ఎస్ఐ ఎస్‌కే షరీఫ్ మంగళవారం తెలిపారు. గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని, ఐదడుగుల రెండు అంగుళాలు ఎత్తు, తెల్లని ఛాయతో ఆకుపచ్చ, గులాబీరంగు గడులు కలిగిన కాటన్ చీర, పచ్చ జాకెట్ ధరించి ఉన్న మృతురాలి వయసు సుమారు 30 నుంచి 35 ఏళ్లు ఉంటుందని పేర్కొన్నారు. సమీపంలో ఒడిశా గ్రామాలకు చెందిన మహిళగా భావించి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కేసు నమోదుచేసి మృతదేహాన్ని పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించామని చెప్పారు.

నేడు స్పెషల్ ఎడ్యుకేషన్ ఎస్ఏ పదోన్నతులు

శ్రీకాకుళం న్యూకాలనీ : జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ యాజమాన్యాల్లోని పాఠశాలల్లో ప్రత్యేక అవసరాల పిల్లలకు బోధన చేయడానికి అర్హత కలిగిన సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించనున్నట్లు డీఈవో కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఖాళీగా ఉన్న రోస్టర్ ప్రాప్తికి పదోన్నతులను కల్పించేందుకు ప్రభుత్వం ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, స్పెషల్ ఎడ్యుకేషన్ బీఈడీ/జనరల్ బీఈడీతోపాటు రెండేళ్ల స్పెషల్ ఎడ్యుకేషన్‌లో డిప్లమో ఇతర అర్హతలు కలిగిన ఎస్‌జీటీ టీచర్లు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్హతలు కలిగిన ఎస్‌జీటీలు ఈ నెల 13 ఉదయం 10 గంటలలోపు జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి తమ దరఖాస్తులను, ఒరిజినల్ సేవా పుస్తకం(సర్వీస్ రిజిస్టార్)తో హాజరుకావాలని డీఈవో సూచించారు.

మేమంతా వైఎస్సార్ సీపీ వెంటే..

- మంత్రి సమక్షంలో స్పష్టం చేసిన గిరిజనులు



మంత్రి సీదిరి అప్పలరాజుతో గిరిజనులు

మందస : గిరిజన గ్రామాల్లో పర్యటిస్తున్న టీడీపీ నాయకులు భోజనాలు పెడతామంటూ పిలిపించి తామంతా తెలుగుదేశం పార్టీలో చేరినట్టు ప్రకటించుకోవడం సిగ్గుచేటని పలువురు గిరిజనులు ధ్వజమెత్తారు. ఈ మేరకు మందస మండలం చీపి, గంధ్రుగాం తదితర గ్రామాలకు చెందిన గిరిజనులు మంగళవారం మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును కలిశారు. టీడీపీ నాయకులు చేస్తున్న కుట్రలు, కుతంత్రాలను మంత్రికి వివరించారు. గిరిజనులకు భోజనాలు(భోజి) అంటే ఇష్టమని, ఈ బలహీనతను ఆసరా చేసుకుని, భోజి ఉందని చెప్పడం.. పార్టీలో చేరామని ప్రకటించుకోవడం జరుగుతోందన్నారు. ఎన్ని కుతంత్రాలు చేసినా తామంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంటే ఉంటామని గిరిజన నాయకులు సవర మోహనరావు, సన్యాసి, గిరి, ఉమాపతి, హేమంతరావు, నీలమ్మ, సీత, తులసమ్మ, మోహిని, ప్రకాశ్, కాంచన, నారాయణ, బాలరాజు, విజయ్‌కుమార్, శివ, రాజారావు తదితరులు స్పష్టం చేశారు. గిరిజనుల అమాయకత్వం ఆసరా చేసుకున్న శిరీషా రాజకీయాలకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. అనంతరం మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు గిరిజనులకు పార్టీ కండువాలు వేసి అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, పార్టీ సీనియర్ నాయకుడు గిన్ని తిరుపతిరెడ్డి, యువజన కార్యదర్శి శానాపతి కిషోర్‌కుమార్, మందస పట్టణ అధ్యక్షుడు సిందిరి జగన్, పార్టీ నాయకులు కొండల ఢిల్లేశ్వరరావు, పత్రి లచ్చన్న, కీలు తిరుపతి, కొర్నాన మల్లేశ్వరరావు, గయా సంతోష్ పాల్గొన్నారు.

ప్రైవేటు ఆస్పత్రులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రైవేటు ఆసుపత్రులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయాలని, ఐదేళ్లు పూర్తయిన వారు రెన్యువల్ చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సమూన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జిల్లా స్థాయి ఆసుపత్రుల రిజిస్ట్రేషన్ అథారిటీ, జిల్లా సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొంది మార్చి 31లోగా డీఎంహెచ్ఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ధరల పట్టిక ప్రదర్శించాలని, ప్రైవేటు ఆసుపత్రుల్లో జరిగే ప్రతి చికిత్సను తప్పనిసరిగా ఆన్‌లైన్ చేయడంతో పాటు ప్రసవాలు, మరణాలను పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. రిజిస్ట్రేషన్, రెన్యువల్ లేకుండా నడిపే సంస్థలపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సమావేశంలో డీఎంహెచ్ఓ బి.మీనాక్షి, సలహా మండలి సభ్యులు డాక్టర్ చక్క నారాయణరావు, డాక్టర్ అమ్మన్నాయుడు, మాస్ మీడియా అధికారి పి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఎంఎస్ యాప్‌పై అవగాహన

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఫ్లయింగ్ స్క్వాడ్, నిఘా బృందాల ద్వారా స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువుల రియల్ టైమ్ డేటాను ఎన్నికల కమిషన్‌కు ఎప్పటికప్పుడు చేరవేయడానికి వినియోగించే ఎన్నికల నిర్బంధ నిర్వహణ వ్యవస్థ (ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్–ఈఎస్ఎంఎస్) యాప్‌పై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. ఎన్నికల నోడల్ అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఎస్పీ జి.ఆర్.రాధికతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాప్‌లో సరైన వివరాలను నమోదు చేయాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ సరిహద్దుల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని, గంజాయి, సారా, మద్యం అక్రమ రవాణా జరగకుండా నిఘా పెంచామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, అదనపు ఎస్పీ ప్రేమకాజల్, జిల్లా అటవీ శాఖ అధికారి నిషాకుమారి, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ రాణీ మోహన్, సీపీఓ ప్రసన్నలక్ష్మి, ట్రెజరీ డీడీ రవికుమార్, లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్, జిల్లా ఆడిట్ అధికారి సుల్తానా, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ మనోజ్‌కుమార్, డీటీసీ చంద్రశేఖర్ రెడ్డి, పోస్టల్ సూపరింటెండెంట్ శివకుమార్, సెబ్ అధికారి తిరుపతి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుబ్బారావు, ఔషధ నియంత్రణ శాఖ ఏడీ చంద్రరావు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

DISTANCE EDUCATION

■ ఆంధ్రా యూనివర్సిటీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ : BA, B.Com, B.Sc., MA, M.Com., M.Sc., MBA & MCA అడ్మిషన్స్ జరుగుచున్నవి. ఫోన్ : 73862 63237, 90590 86040 [V-2429]

EDUCATION

■ Single Sitting : 10th, Inter, BA, B.Com, B.Sc, BED, BPED, UGDPED, BBA, MBA, DMLT, BMLT, BNYS, BAMS, BHMS, B.Tech, NURSING ITI, Pharmacy, LLB, Phd : 81435 83986. [L-806434]

WANTED

■ న్యూఢిల్లీలో ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబంలో 1 సం వయస్సు గల బాబును చూసుకోవడానికి కేర్ టేకర్ కావలెను. వసతి భోజనం కలదు. ✆ 93969 71848. [O-759045]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520,89197 39694. [M-1167544]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1233883]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ 15000-40000, ఫ్రీ రూమ్ + భోజనం, HYD. ఫోన్ 7995365999. [HA-1334]

■ ఇంటిపని, వంటపని చేయుటకు బాధ్యత గల స్త్రీలు కావలెను, వయస్సు: 40 లోపు, భోజనం మరియు వసతి కల్పించబడును. జీతం: 10,000/- ఇవ్వబడును. ✆ 83286 41021 [B-1251778]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.